ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

5 మహబూబాబాద్
శనివారం 22 ఫిబ్రవరి 2025

విద్యార్థుల పురోగతిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

- మెనూ ప్రకారం భోజనం ఇవ్వాలి
- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

కేసముద్రం/ఇనుగుర్తి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ గురుకులాల్లోని విద్యార్థుల పురోగతిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ ఆదేశించారు. కేసముద్రం మండలం మహమూద్‌పట్నం కస్తూర్బా గాంధీ బాలికల, ఇనుగుర్తి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకులాలను, ఇనుగుర్తి పీహెచ్‌సీని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గురుకులాల్లోని పరిసరాలు, తరగతి గదులు, మౌళిక వసతులను, స్టోర్‌రూంలో వంటకు ఉపయోగించే ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు ఖచ్చితంగా మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని సిబ్బందిని ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులు 10 జీపీఏ సాధించేందుకు ఉపాధ్యాయులు సమగ్ర ప్రణాళికతో బోధించాలని అన్నారు. ప్రతీ విద్యార్థి పురోగతిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అన్నారు. ఇనుగుర్తి పీహెచ్‌సీకి వచ్చిన రోగులతో కలెక్టర్ మాట్లాడారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు సూచనలు చేశారు. ఆస్పత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి, మందుల కొరత లేకుండా చూసుకోవాలని ఆదేశించారు.


ఇనుగుర్తి బాలికల గురుకులంలో వండిన ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న కలెక్టర్

వందశాతం ఫలితాలు సాధించేలా కృషి చేయాలి

మహబూబాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : రానున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల నేపథ్యంలో జిల్లాలోని విద్యార్థులు వందశాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు, అధ్యాపకులు కృషి చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. ఈ పరీక్షలు ఉండటంతో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. జిల్లాలోని సంక్షేమ వసతిగృహాల్లో వచ్చే మూడురోజుల సంబంధిత అధికారులు, మండల ప్రత్యేకాధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని చెప్పారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు సమన్వయంతో వసతి గృహాలను సందర్శించి రోజువారీ నివేదికను అందజేయాలని సూచించారు. హాస్టల్ విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారాన్ని అందించాలని చెప్పారు. విద్యార్థులకు మెరుగైన బోధనకు చర్యలు చేపట్టాలని, నిత్యావసర సరుకుల నాణ్యతను పరీక్షించాలని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డైట్‌మెనూ ప్రకారం పక్కాగా ఉండాలన్నారు వసతి గృహాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు.

మిర్చి తూకాల్లో కోతలు

- వెంటనే అరికట్టాలని డిమాండ్
- ఏఐకేఎఫ్, రైతు సంఘం రాష్ట్ర బృందం
- కేసముద్రం వ్యవసాయ మార్కెట్ సందర్శన


కేసముద్రం మార్కెట్లో మిర్చిని పరిశీలిస్తున్న ఏఐకేఎఫ్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర బృందం

కేసముద్రం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో మిర్చి రైతుల నుంచి తూకాల్లో, నగదు చెల్లింపుల్లో ఎడాపెడా కోతలు విధిస్తున్నారని, రైతులకు అన్యాయం చేస్తున్నారని దీన్ని వెంటనే అరికట్టాలని తెలంగాణ అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్, ఏఐకేఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్‌రెడ్డి హంసారెడ్డిలు డిమాండ్ చేశారు. కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లోని మిర్చి యార్డును శుక్రవారం వారు సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇక్కడి మార్కెట్లో ఈ-నామ్ విధానం సక్రమంగా అమలు కాకపోవడం వల్ల రైతులకు మేలు జరగడంలేదని అన్నారు. మిర్చి తూకాల్లో గ్రాములను లెక్కించకుండా కోత విధిస్తూ రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. అలాగే నగదు చెల్లింపుల్లోను కోతలు విధిస్తుండడంతో రైతులు ఆర్థికంగా నష్టపోవాల్సివస్తుందని, వీటిని వెంటనే అరికట్టాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మిర్చి మార్కెట్లలో రైతులపై జరుగుతున్న ఆర్థిక దోపిడీని, వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని అన్నారు. వారి వెంట ఉమ్మడిజిల్లా కార్యదర్శి ఓదెల రాజన్న, శ్రీనివాస్, లింగయ్య, వెంకన్న ఉన్నారు.

26 నుంచి మానుకోట మార్కెట్‌కు సెలవులు

మార్చి 2 వరకు క్రయవిక్రయాలు బంద్

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు ఈ నెల 26 మార్చి 2వ తేదీ వరకు మార్కెట్‌కు సెలవులు ఉన్నట్లు మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ తెలిపారు. ఈనెల 26న మహాశివరాత్రి పర్వదినం, 27న మహాశివరాత్రి జాగరణ, 28న అమవాస్య, మార్చి 1, 2న శని, ఆదివారాలు వారాంతపు సెలవుల సందర్భంగా మార్కెట్ యార్డు బంద్ ఉంటుందన్నారు. రైతులు గమనించి మార్కెట్ యార్డుకు ఎలాంటి సరుకులు తీసుకురాకూడదని, మార్చి 3న సోమవారం మార్కెట్ యథావిధిగా నడుస్తుందని తెలిపారు.

24న ఎమ్మెల్సీ కవిత పర్యటన



మహబూబాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈనెల 24 తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పర్యటించనున్నారు. జిల్లాలోని దంతాలపల్లి మండలం రామనుజపురం, మరిపెడ మండలం చిల్లంచర్లలో ప్రైవేట్ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. కురవి మండల కేంద్రంలోని శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించి రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకోనున్నారు. గూడూరు మండలం మచ్చర్ల శివారు రేగడి తండాలో వన్యప్రాణి సంరక్షణ మండలి మాజీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు బానోత్ రవికుమార్‌ను పరామర్శించనున్నారు. అక్కడి నుంచి వరంగల్ జిల్లా నర్సంపేటకు బయలుదేరి వెళ్లనున్నారు. 24న జిల్లాలో ఎమ్మెల్సీ కవిత పర్యటన రూట్ మ్యాప్ ఖరారైనట్లు తెలిసింది.

'బ్యాంకు రుణాలను క్లియర్ చేసుకోండి'

కురవి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : కురవి ఏపీజీవీబీ బ్యాంకు పరిధిలోని రుణాలను సెటిల్‌మెంట్ చేసుకుని, క్లియర్ చేసుకోవాలని మేనేజర్ లోకేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకు నుంచి రుణం తీసుకుని 31 మార్చి 2024 వరకు బాకీ తీర్చని వారిని మొండి బకాయిలుగా గుర్తించామన్నారు. ఇటువంటి వారు 28 ఫిబ్రవరి 2025 వరకు వన్‌టైం సెటిల్‌మెంట్ అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. రైతులకు 40 శాతం నుంచి 75 శాతం వరకు తగ్గింపు ఇస్తున్నట్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పట్టుదలతో చదవాలి

- విద్యార్థులకు అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ సూచన
- నాణ్యమైన ఆహారం అందించాలని ఏకలవ్య అధికారులకు ఆదేశం


మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో బియ్యాన్ని పరిశీలిస్తున్న లెనిన్‌వత్సల్ టొప్పో

బయ్యారం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో సూచించారు. పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. నామాలపాడులోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల (ఈఎంఆర్ఎస్)ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలోని తరగతి గదులను, డైనింగ్ హాల్, కిచెన్, స్టడీ రూమ్స్‌తో పాటు పాఠశాల ఆవరణ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా షెడ్యూల్ ప్రకారం వారికి వైద్య పరీక్షలు నిర్వహించాలని, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్య బోధించాలన్నారు. విద్యార్థులతో మాట్లాడి పాఠశాల్లో అందుతున్న సేవలను అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో బయ్యారం ఎంపీడీవో విజయలక్ష్మీ పాల్గొన్నారు.

మైనార్టీ రెసిడెన్షియల్ తనిఖీ..

మహబూబాబాద్ టౌన్, (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో శుక్రవారం రాత్రి అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. నిత్యావసర సరుకులు పరిశీలించి, స్టడీ అవర్‌లో ఉన్న విద్యార్థులతో మాట్లాడారు. సబ్జెక్టుల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి పరీక్షల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు.

పంచాయతీ నిధులు గోల్‌మాల్

- రూ.3.21లక్షల ఎస్‌బీఎం బిల్లులు స్వాహా చేసిన కార్యదర్శి
- జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసిన బాధితులు
- గోల్ బోడ్కాతండాలో ఆలస్యంగా వెలుగులోకి


ఎంపీడీవో యాకయ్యకు వినతిపత్రం అందజేస్తున్న తండా వాసులు

నర్సింహులపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోల్ బోడ్కాతండా గ్రామ పంచాయతీ నిధులు స్వాహా అయ్యాయి. తండాలో పలువురికి చెందాల్సిన ఎస్‌బీఎం (వ్యక్తిగత మరుగుదొడ్లు) బిల్లులు పంచాయతీ కార్యదర్శి సొమ్ము చేసుకున్న విషయం బాధితులు మండల, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు బాదావత్ సరోజ, లూనావత్ వాసు, బానోతు లాల్య, భూక్యా భద్రి, బాదావత్ విజయ తెలిపిన వివరాల ప్రకారం. 2019, 2020, 2021 సంవత్సరానికి సంబంధించి ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో 31 మంది లబ్ధిదారులకు వ్యక్తిగత మరుగుదొడ్ల (ఎస్‌బీఎం) బిల్లులు ఒక్కొక్కరికి రూ. 12వేలు చొప్పున రూ.3,21,020 ప్రభుత్వం నుంచి జీపీ ఎస్‌బీ ఖాతాలో జమ అయినట్లు తెలిపారు. మరుగుదొడ్ల లబ్ధిదారులు పలుమార్లు బిల్లు కోసం కార్యదర్శిని సంప్రదించినా బిల్లులు ఇవ్వలేదని తెలిపారు. కానీ, 2023 మే 18వ తేదీన రూ.23 వేలు, 2023 జూన్ 5వ తేదీన రూ. 2.60 లక్షలు, రూ. 25 వేలు, 2023 సెప్టెంబరు 2వ తేదీన రూ.6వేలు, 2024 మే 7వ తేదీన రూ.5వేలు చొప్పున స్వాహా చేసినట్లు తెలిపారు.

ఈ విషయం ఆలస్యంగా తెలుసుకున్న లబ్ధిదారులు శుక్రవారం జిల్లా కలెక్టర్, డీపీవో, ఎంపీడీవోలకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాదావత్ వెంకన్న, కోటేష్, భూక్యా గిరినాయక్, లాలు, ప్రవీణ్ ఉన్నారు.

మిర్చి రైతులను ఆదుకోవాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు


మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ వద్ద మిర్చి రైతులతో మాట్లాడుతున్న సాంబశివరావు

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మిర్చి రైతులను ప్రభుత్వాలు అన్నివిధాలుగా ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. వేములవాడ నుంచి కొత్తగూడెం వెళ్తుండగా శుక్రవారం రాత్రిమార్గమధ్యలో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ వద్ద కాసేపు ఆగారు. ఈ సమయంలో రైతులు సాంబశివరావు వద్దకు వచ్చి తమ గోడును వెల్లబోసుకున్నారు. తమ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని రైతులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని చెప్పారు. ఆయన వెంట జిల్లా కార్యదర్శి విజయసారథి, అజయ్‌సారథి, పెరుగుకుమార్, వెలుగు శ్రావణ్ రైతులు అమర్‌సింగ్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

8

గుప్తనిధుల కోసం తవ్వకాలు

పోలీసుల అదుపులో ఒకరు


తొర్రూరు మండలం మడిపల్లి గ్రామ శివారులో గుప్తనిధుల కోసం జరిపిన తవ్వకాలు


గుప్తనిధుల కోసం తవ్వకాల కోసం తీసుకువచ్చిన పూజ సామగ్రి

తొర్రూరురూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : గుప్తనిధుల కోసం అనుమానాస్పదంగా తవ్వకాలు జరిగిన సంఘటన తొర్రూరు మండలం మడిపల్లి గ్రామ శివారులో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం... మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం మడిపల్లి గ్రామ శివారు ఇటుకబట్టీల సమీపంలోని ఓ బావి వద్ద గుర్తు తెలియని వ్యక్తులు తవ్వకాలు జరుపుతుండగా పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, గ్రామస్థులు అప్రమత్తమై సంఘట స్థలానికి చేరుకోగా తవ్వకాల్లో నిమగ్నమైన ఐదుగురు వ్యక్తులు పరారీకి ప్రయత్నించగా అందులో జెల్ల వెంకన్న అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. నెల్లికుదురు మండలం క్యాంపు తండాకు చెందిన సురేష్ అతని అనుచరులు పార, గడ్డపార, పూజసామగ్రి గుమ్మడికాయ, పసుపు, కుంకుమ్మ, నవధాన్యాలుతో వచ్చి తవ్వకాలు ప్రారంభించినట్లు తెలిపారు. గుప్తనిధుల తవ్వకాల వెనుక ఎవ్వరు ఉన్నారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని, వెంకన్నపై కేసు నమోదు చేసి, మరో నలుగురి కోసం గాలింపులు చేస్తున్నట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.

పలుగుల అడవుల్లోనే పులి

● 12 రోజులుగా జంకుతున్న జనం ● నాలుగు బృందాలుగా తనిఖీలు ● 30 మంది అధికారుల బృందం గాలింపు


అన్నారం గ్రావిటీ కాల్వ వద్ద, పలుగుల అడవిలో గుర్తించిన పులి పాదముద్రలు

మహదేవపూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మహదేవపూర్ మండల ప్రజలు గత 12 రోజులుగా పెద్ద పులి భయంతో జంకుతున్నారు. కాటారం మండలం నస్తూరుపల్లి, గూడూరు, గుండ్రాతిపల్లి అడవులలో 12 రోజుల నుంచి మగ పులి ఆడ పులి కోసం సంచారం చేస్తుంది. ఇప్పటికే పలు సీసీ కెమెరాలు ఫారెస్టు అధికారులు బిగించినా పులి ఆనవాళ్లు తెలియడం లేదు. రోజుకో ప్రాంతంలో తిరుగుతున్నట్లు పులి పాదాలను అధికారులు గుర్తించారు. అయినప్పటికి నాలుగు బృందాలుగా ఏర్పాటై అధికారులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నారు. సరైన జాడ దొరకకపోవడంతో రైతులు, అడవికి పశువుల కాపరులు వెళ్లకుండా భయాందోళనకు గురువుతున్నారు. శుక్రవారం ఉదయం గ్రావిటి కాల్వ దాటి కాళేశ్వరం అడవులకు వచ్చిందని, పాద ముద్రలతో ఫారెస్టు అధికారులు గుర్తు పట్టారు. గత రెండు సంవత్సరాల నుంచి మగ పులి ఆడ పులి కోసం వేట మొదలు పెట్టడం జరుగుతోంది. కొన్ని రోజుల తర్వాత ఆడ పులి జాడ కనపడక గోదావరి దాటి మహారాష్ట్ర వైపు వెళుతుందని పలువురు చర్చించుకుంటున్నారు. మరికొంత మంది నీటి తావు ఎక్కడ ఉంటే అక్కడ పులి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా 12 రోజుల నుంచి రెండు మం డలాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఒకవైపు మిర్చి పంట చేతికి వచ్చినందున రైతులు పంట పొలాలకు వెళ్లక తప్పడం లేదు. మరోవైపు పులి ఎప్పుడు దాడి చేస్తుందనే భయంతో పలు గ్రామాల ప్రజలు జంకుతున్నారు. అదిలాబాద్ నుంచి వచ్చిన యానిమల్ ట్రాకింగ్ టీం సభ్యులు పులి పగ్ మార్క్‌లను పరిశీలిస్తున్నారు. మహదేవపూర్ మండలంలో పెద్ద పులి తిరుగుతుందన్న వార్తతో జనం భయం గుప్పిట్లో గడుపుతున్నారు. కుంటలు, వాగులు, ఒర్రెల వద్ద పులి పాదముద్రలు గుర్తించారు. మహదేవపూర్ మండలంలో పలుగుల ఇసుక క్వారీల వైపు కూడా ఎవరూ వెళ్లడం లేదు. ఇసుక క్వారీల వైపు పులి అడుగులు ఏర్పడడంతో జనం జంకు తున్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పంట పొలాల వద్దకు వెళ్లవద్దని అధికారులు సూచి స్తుండగా తమ పంటలు చేతికొచ్చాయని, పంటలు ఎండిపోతున్నాయని రైతులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

● జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి రవీంద్రశర్మ

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : దేశ వ్యాప్తంగా మార్చి 8న జరిగే జాతీయ లోక్ ఆదాలత్ ను విజయవంతం చేయాలని మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి రవీంద్రశర్మ అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో శుక్రవారం పోలీస్ అధికారులు, ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి రవీంద్రశర్మ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా కోర్టుల్లో వేల సంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, అన్ని కేసులను సాధారణ పద్దతిలో పరిష్కరించడం సాధ్యం కాదని, అందుకనే జాతీయ లోక్ ఆదాలత్‌ను వినియోగించుకుని రాజీపడగలిగే కేసులను రాజీ మార్గం ద్వార పరిష్కరించుకోవచ్చన్నారు. అందులో క్రిమినల్, సివిల్, భూతగాద, మోటార్ వాహనప్రమాదం, వివాహ, కుటుంబ, తగాద కేసులు, బ్యాంకు చెక్‌బౌన్స్, విద్యుత్‌శాఖ, చిట్‌ఫండ్స్ ఇన్సూరెన్స్ ఎక్సైజ్, ట్రాఫిక్, చోరీ కేసులు, ఈ చలాన్ కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సమీక్షలో సీనియర్ సివిల్ జడ్జి సురేష్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి, డీఎస్పీలు తిరుపతిరావు, కృష్ణకిశోర్, డీపీవో రజిని, బాలకిషన్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి

తొర్రూరు రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : రానున్న వేసవి కాలం దృష్ట్యా ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా చూడాలని డీపీవో హరిప్రసాద్ అన్నారు. శుక్రవారం తొర్రూరు మండలం నాంచారి మడూరు గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శి, వాటర్ మెన్‌తో తాగునీటి వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అవసరమైన మేరకు పైపు లైన్లు మరమ్మతు చేయడంతో పాటు, తాగునీటి సరఫరాకు ముందుస్తుగా చర్యలు తీసుకోవాలి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పూర్ణచందర్, పంచాయతీ కార్యదర్శి సతీష్, వాటర్‌మెన్ రాజు పాల్గొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి ఉద్యోగులు కృషి చేయాలి

తొర్రూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ అభివృద్ధికి ఉద్యోగులు కృషి చేయాలని తొర్రూరు డిపో మేనేజర్ పద్మావతి అన్నారు. శుక్రవారం ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు తొర్రూరు ఆర్టీసీ డిపోలో నాలుగు రోజులుగా ఉద్యోగులకు పవర్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముగింపు సందర్బంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగులు రాణించేందుకు నైపుణ్య శిక్షణలో భాగంగా వృత్తి పరమైన సవాళ్లను ఎదుర్కొనేందుకు ఈ శిక్షణ ఏర్పాటు చేశామన్నారు. ఉద్యోగులు సమయ పాలన పాటిస్తూ క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ సంస్థ అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. అనంతరం శిక్షణలో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతి ప్రదానం, క్రమ శిక్షణతో విధులు నిర్వహించాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఐ రజిత, ఎంఎఫ్ విజయ్‌కుమార్, ఏడీసీలు, ఆర్టీసీ కార్మికులు తదితరులు ఉన్నారు.

అందుబాటులో లేని 'కార్మిక' అధికారి

ఇబ్బందులు పడుతున్న ప్రజలు


అధికారి కోసం కార్యాలయం వద్ద ఎదురుచూస్తున్న లబ్ధిదారులు

తొర్రూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు డివిజన్ కేంద్రంలోని కార్మిక శాఖ సహాయ లేబర్ అధికారి అందుబాటులో లేకపోవడంతో ప్రజలు, కార్యాలయానికి వచ్చే లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలోని 18 మండలాలకు గాను తొర్రూరులో, మానుకోటలో లేబర్ అధికారి కార్యాలయాలు ఉన్నాయి. తొర్రూరు పరిధిలో 11 మండలాలకు చెందిన సంఘటిత, అసంఘటిత, తాపీ మేస్త్రీ, రోజువారి కూలీలు, రేషన్ కార్డులు ఉన్న ప్రతి ఒక్కరూ కార్యాలయానికి వస్తుంటారు. కార్యాలయంలో సహాయ లేబర్ అధికారి ఒక్కడే ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఉన్నతాధికారులు సమావేశాలకు, ఫీల్డ్ విజిట్‌లకు వెళ్లిన నేపథ్యంలో కార్యాలయానికి వచ్చిన వారికి సమాధానం చెప్పే వారు కరువయ్యారు. శుక్రవారం వివిధ మండలాలకు చెందిన లబ్ధిదారులు కార్యాలయానికి రావడంతో తాను అందుబాటులో లేనని, కార్యాలయం ఎదుట నోటీస్ బోర్డు అంటించి వెళ్లడంతో పలువురు ఆ ఫోటోలను వాట్సాప్ గ్రూప్‌లలో వైరల్ చేశారు. దీనిపై అధికారిని ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు. అందుబాటులో ఉండే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

'పాతపెన్షన్' కోసం 2న హైదరాబాద్‌లో యుద్ధభేరి


యుద్ధభేరి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎస్ ఉద్యోగులు

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : పాతపెన్షన్ విధానాన్ని అమలు పర్చాలని డిమాండ్‌తో మార్చి 2న టీఎస్ సీపీఎస్‌యూ ఆధ్వర్యంలో హైదరాబాద్ ధర్నాచౌక్ వద్ద మార్చి 2న జరుపతలపెట్టిన యుద్ధభేరికి భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్కే, మొబైల్ అహ్మద్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ మునిసిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం యుద్ధభేరి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు శాపంగా మారిన సీపీఎస్ మహమ్మారీ నుంచి విముక్తి కల్పించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొండి వైఖరీ విడనాడి కామన్ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్డీ. రఫిక్, బా నోత్ రవీందర్, సింగు రమేష్, గుగులోతు రవీందర్‌నాయక్, కిషోర్, శ్రీదేవి, శ్రీనివాస్, రూప, ప్రియాంక, భరత్, రమేష్, సుధాకర్, కిరణ్, మమ్ముట్టి పాల్గొన్నారు.

దేవాదులలో మరో రెండు మోటార్లు ఆన్


ఫేజ్-3లో ఆన్ చేసిన మోటార్లు

కన్నాయిగూడెం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని గుట్టల గంగారం వద్ద ఉన్న జే చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు నుంచి శుక్రవారం మరో రెండు మోటార్లను ఆన్ చేశారు. గురువారం వరకు ఫేజ్-2లో ఒకటి, ఫేజ్-3 నుంచి రెండు మోటార్ల ద్వారా నీటిని పంపింగ్ చేసిన అధికారులు శుక్రవారం ఫేజ్-3లో మరో రెండు మోటార్లను ఆన్ చేసి మొత్తం ఐదు మోటార్ల ద్వారా 1,414 క్యూసెక్కుల నీటిని భీంఘనపూర్ రిజర్వాయర్‌కు పంపింగ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజికి ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎగువ నుంచి 2,350 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో బ్యారేజిలోని ఒక గేటును ఎత్తి 936 క్యూసెక్కుల నీటిని దిగువకు వ దులుతున్నారు. సమ్మక్క సాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 6.94 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 3.88 టీఎంసీల నీళ్ల నిల్వ ఉన్నాయి. దేవాదుల ఇంటేక్‌వెల్ వద్ద 79.40 మీటర్లు నీటిమట్టం నమోదు కాగా, సమ్మక్క సాగర్ వద్ద 79.60 మీటర్ల నీటిమట్టం నమోదు అయినట్లు సీఏడీ డీఈఈ శరత్‌బాబు, ఏఈ సాయిరాంలు సంయుక్తంగా తెలిపారు.

సరోత్తంరెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించుకోవాలి

- మాజీ ఎంపీ సీతారాంనాయక్

ములుగు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నిల్లో బీజేపీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించుకోవాలని మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం ములుగులో పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన జాతీయ కార్యవర్గ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు, బీజేపీ నేత ఎర్రబెల్లి ప్రదీప్‌రావులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతారాంనాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదని, సరోత్తంరెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించినట్లయితే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. బీజేపీ టీపీయూఎస్ బలపరిచిన అభ్యర్థి పులి సరోత్తంరెడ్డికి ఉపాధ్యాయలోకం, విద్యావంతులు ఆలోచించి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో నాయకులు విజయచందర్‌రెడ్డి, వెన్నంపల్లి పాపన్న, చింతలపూడి భాస్కర్‌రెడ్డి, అజ్మీరా కృష్ణవేణినాయక్, కొత్త సురేందర్, భూక్య జవహర్‌లాల్, శీలమంతుల రవీంద్రచారి, నరేష్, జినుకల కృష్ణాకర్‌రావు, ఏనుగు రవీందర్‌రెడ్డి, గుగులోత్ స్వరూప, పండ్ల బుచ్చయ్య, రాయంచు నాగరాజు, పైడాకుల మల్లేష్, మార్క సతీష్, లక్ష్మన్, చక్రవర్తి, రాకేష్, శ్రీనివాస్, జనార్దన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ సీతారాంనాయక్

ప్రభుత్వ పాఠశాలకు కొత్త రంగులు

హెచ్ఎం సొంత నిధులతో పెయింటింగ్



కొత్త రంగులతో ఉన్న పాఠశాల భవనం

కేసముద్రం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నారాయణపురం పీక్లాతండా శివారు బోడగుండ తండా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కొత్త రంగులతో కళకళలాడుతోంది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమణ తన సొంత నిధులు రూ.25 వేలతో పాఠశాలలోని మూడు గదులు, వరండా, ప్రహరీ, వంటగది, జెండా గద్దె, తలుపులు, కిటికీలకు రంగులు వేయించడాన్ని బుధవారం పూర్తి చేశారు. పాఠశాలను తన సొంత ఇల్లులా భావించి రంగులు వేయించడంపట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి


చెర్లపాలెం బీసీ వసతి గృహంలో మరుగుదొడ్లను పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్ శాంతికుమార్

తొర్రూరు రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : హాస్టల్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తొర్రూరు మునిసిపల్ కమిషనర్ శాంతికుమార్ ఆదేశించారు. శుక్రవారం తొర్రూరు మండలం చెర్లపాలెం బీసీ వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీచేసి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గురుకుల పాఠశాలలో నాణ్యమైన విద్య అందించుటకు కృషి చేస్తుందన్నారు. వార్డెన్లు పిల్లల ఆరోగ్యం, ఆహారం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం పరిసర ప్రాంతాలను కలియ తిరుగుతూ డైనింగ్ హాల్, మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలకు ఉదయం టిఫిన్స్ సాయంత్రం భోజనం పెడుతున్నామని, మధ్యాహ్నం పాఠశాలలోనే భోజనం చేస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కట్టస్వామి, హెల్త్ అసిస్టెంట్ రాజు. శానిటరీ ఇన్స్పెక్టర్ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగు నీటి ఎద్దడి నివారణపై సమీక్ష

మరిపెడ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో తాగు నీటి ఎద్దడి నివారణపై శుక్రవారం మరిపెడ, చిన్న గూడూరు మండలాలకు చెందిన మిషన్ భగీరథ ఇంజినీర్లు, పంచాయతీ కార్యదర్శులు, వాటర్‌మెన్‌లతో ఆయా మండలాల ఎంపీడీవోలు విజయ, రామరావు శుక్రవారం సమీక్ష సవవేశం నిర్వహించారు. మిషన్ భగీరథ నీటి సరఫరాతో పాటు రక్షిత తాగు నీటి బావులు, పవర్‌బోర్లు, చేతిపంపు వినియోగంపై అవగా హన కలిపించారు. కార్యక్రమంలో డీఈఈ అనూష, ఏఈలు హథిరాం, అవినాశ్, ఎంపీవోలు సోమ్లా, రజినీ వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వాటర్‌మెన్‌లు పాల్గొన్నారు.

గోడపై అటవీ జంతువుల బొమ్మలు

● చిత్రం చెప్పే విశేషాలు



గూడూరు అటవీశాఖ కార్యాలయ గోడలపై వేసిన చిత్రాలివే..

గూడూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఆర్ట్.. జనాన్ని ఆలోచింప చేస్తుందనడంలో డౌటే లేదు. గ్యాలరీలోని ఆర్ట్ వర్క్‌తో పోల్చితే ఓపెన్ ఆర్టే.. మోస్ట్ పవర్‌పుల్ అని క్రియేటీవ్ పీపుల్ అంటున్నారు. నాలుగు గోడల మధ్య చూపించే పెయింటింగ్స్ కన్నా.. పబ్లిక్ స్థలాల్లో గోడలపై గీసిన, నేరుగా కన్పిస్తున్న బొమ్మలైతేనే ఎక్కువ మంది చూస్తారని చెబుతున్నారు. ప్రజల్లోకి సోషల్ మెసేజ్‌ని సింపుల్‌గా పంపడానికి ఇదే బెస్ట్ ఆప్షన్ అని వివరిస్తున్నారు. గూడూరు అటవీశాఖ కార్యాలయం గోడలపై ఎఫ్‌డీవో చంద్రశేఖర్ ఆదేశాలనుసారం ఎఫ్ఆర్వో సురేష్ కార్యాలయ ప్రహరీపై వన్య ప్రాణులు, ప్రకృతి, పచ్చని ప్రకృతి బొమ్మలు వేయించారు. అచ్చం అటవీ వాతావరణంలో కళ్లకు కట్టినట్లుగా బొమ్మలు కన్పిస్తున్నాయి. అడవి, మనుషులు, వన్యప్రాణులు ప్రకృతిలో కలిసి జీవించామన్న సందేశాన్ని ఇస్తున్నాయి. మొక్కలను, జంతువులను కూడా మనుషులాగే భావించాలని చెప్పడమే ఈ పెయింటింగ్‌ల కాన్సెప్ట్ అని ఎఫ్ఆర్వో సురేష్ తెలిపారు. ప్రజలకు ప్రకృతిపై మరింత అవగాహన కల్పించే కెపాసిటి పెయింటింగ్‌కు ఉందని, జనాన్ని స్వచ్ఛ్ భారత్ మిషన్‌వైపు విజయవంతంగా నడిపించాలని ఈ చిత్రాలను వేయించినట్లు పేర్కొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2370	2100
పల్లికాయ (సూక)	6600	4600
పల్లికాయ (పచ్చిది)	5500	3100
కందులు	7272	5540
పెసళ్లు	7029	4645
పత్తి	6810	5800
కొత్త పత్తి	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	13700	9000
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	16500	11500
యూఎస్ 341	13300	11500
దేశీ	26000	20500
ఎల్లో మిర్చి	17000	17000
దీపిక	16400	15245
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

సేవలతో ఉపాధి పొందుతున్న యువత
- మందుల పిచికారీకి గాను ఎకరానికి రూ.500 అద్దె
- వినియోగించుకునేందుకు ముందుకు వస్తున్న రైతులు
- పే లోడ్‌ను బట్టి ఒక్కో డ్రోన్ ఖరీదు రూ 5.లక్షల నుంచి రూ.12 లక్షలు



అద్దెకు వ్యవసాయ డ్రోన్లు

ఉమ్మడి జిల్లాలో అందుబాటులో 15 డ్రోన్లు

హనుమకొండ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయంలో యాంత్రీకరణ పెరుగుతోంది. సాగులో సంచలనాత్మక మార్పుల్లో భాగంగా అందుబాటులోకి వచ్చిన వ్యవసాయడ్రోన్లు.. ఇప్పుడు పచ్చని పంటలపై చక్కర్లు కొడుతున్నాయి. తక్కువ ఖర్చుతో సమర్థవంతంగా పంటలకు ఎరువులు, పురుగు మందులను పిచికారీ చేయడానికి, విత్తనాలను చల్లడానికి రైతులు వీటిని అద్దెకు తీసుకుంటున్నారు. డ్రోన్‌ల ద్వారా రైతులకు వ్యవసాయ పనులు చేసిపెట్టేందుకు కొన్ని గ్రామాల్లోని యువకులు దీనిని ఒక ఉపాధిగా మార్చుకుంటున్నారు. సంప్రదాయ పద్ధతుల్లో పురుగుల మందు పిచికారీ చేసే పద్ధతులకు.. ఈ డ్రోన్ విధానం సరసమైన, సమర్థవంతమైన, సురక్షితమైన, ఆధునాతన ప్రత్యామ్నాయంగా ఉపయోగపడుతోంది.

కూలీల కొరతతో..

పంట పొలాల్లో ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను చల్లడానికి సంప్రదాయ పద్ధతిలో కూలీలను పెట్టుకున్నట్లయితే ఖర్చు తడిసిమోపెడవుతోంది. ఒక్కో వ్యవసాయ కూలీకి రోజుకు కూలీగా రూ. 500 నుంచి రూ.1000 వరకు చెల్లించాల్సి ఉంటుంది. అయినా కూలీల కొరత వల్ల వారు కూడా కొన్ని సందర్భాల్లో దొరకడం లేదు. దీనికి తోడు రైతులు లేదా కూలీలు పురుగుల మందులు, ఎరువులు చల్లే క్రమంలో వాటి ప్రభావం వల్ల అనారోగ్యానికి గురవుతున్నారు. రైతులు ఇంతకు ముందు తైవాన్ స్ప్రే మిషన్లను వాడుతున్నారు. వీటి వల్ల హానికరమైన రసాయనాల వల్ల దీర్ఘకాలిక చర్మ, శ్వాసకోశ సంబంధ వ్యాధుల బారిన పడుతున్నారు. పైగా యంత్రానికి రూ.1000, అదనపు బ్యాటరీకి రూ.4వేలు పెట్రోల్‌కు రూ.8వేల చొప్పున వెచ్చించాల్సి వస్తోంది. ఇది రైతులపై అధిక ఆర్థిక భారాన్ని మోపుతోంది. దీంతో పిచికారీ ప్రక్రియ అనేది ఖరీదైందిగా, ప్రమాదకరమైందిగా మారిపోయింది. అదే మందుల పిచికారీకి లేదా పొలాల్లో ఇతర సస్యరక్షణ చర్యలకు డ్రోన్ సేవలను వినియోగించుకున్నట్లయితే ఖర్చు గణనీయంగా తగ్గుతుంది. ఒకరానికి సగటున రూ.600 వరకే ఖర్చవుతోంది.

ఉపాధి

డ్రోన్‌సేవలను వినియోగించుకోవడానికి రైతులు ముందుకు వస్తుండడంతో గ్రామాల్లోని యువ రైతులు వాటిని కొనుగోలు చేసి తమ అవసరాలకు వినియోగించుకోవడంతో పాటు ఇతర రైతులకు అద్దెకు ఇవ్వడం ద్వారా అదనపు ఉపాధిని పొందుతున్నారు. సాధారణంగా ఒక డ్రోన్ పేలోడ్‌ను బట్టి ధర రూ.5లక్షల నుంచి రూ.12లక్షల వరకు ఉంటుంది. ఉదాహరణకు కేవలం పురుగు మందులను చల్లడానికి మాత్రమే అయితే దానికి అమర్చే పేలోడ్‌ను బట్టి ధర రూ.5లక్షల వరకు ఉంటుంది. అలా కాకుండా డ్రోన్ ద్వారా బహుముఖ సేవలను పొందాలనుకుంటే అందుకు అవసరమైన పేలోడ్‌లను అదనంగా జతచేసుకుంటూ వెళితే వాటి ధర క్రమంగా పెరుగుతూ ఉంటుంది. ఐదు నుంచి పది ఎకరాలు ఆపైన పొలం ఉన్న మధ్య, సంపన్న రైతులు సంప్రదాయ పిచికారీకి అయ్యే ఖర్చును తగ్గించుకునేందుకు ఏకంగా డ్రోన్లనే కొనుగోలు చేస్తున్నారు. పంట సీజన్లో వారు తమ పొలాల కోసం ఈ డ్రోన్లను వినియోగించుకోవడంతో పాటు ఇతర రైతులకు అద్దెకు ఇస్తున్నారు. డ్రోన్ యజమానులే అవసరమైన ఇతర రైతుల పొలాల్లో పిచికారీ చేయడం లాంటి సేవలను డ్రోన్లతో అందించి ఎకరానికి రూ.500 చొప్పున చార్జి తీసుకుంటున్నారు. ఇది పేద, మధ్య తరగతి రైతులకు కూడా ఎంతో లాభదాయకంగా ఉంటోంది. దీనితో ఇప్పుడిప్పుడే చాలా మంది రైతులు అద్దె ప్రాతిపదికపై వాడుకునేందుకు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 15పైగా డ్రోన్లు అమ్మకమయ్యాయి. మరో 5 డ్రోన్లను రైతులకు సర్వీస్ కోసం అందుబాటులో ఉంచారు. డ్రోన్లను కొనుగోలు చేసిన రైతులు వారు వాడుకోవడంతో పాటు ఇతర రైతులకు అద్దెకు ఇస్తున్నారు. దీని ద్వారా పంట సీజన్‌లో రోజుకు రూ. 1000 నుంచి రూ. 2000 వరకు ఆదాయం పొందుతున్నారు. పంట సీజన్‌లో డిమాండ్‌ను బట్టి ఇంతక్నా ఎక్కువే ఆర్జిస్తున్నారు. డ్రోన్లు కొనుగోలు చేయాలని ఆసక్తి ఉన్న వారు హైదరాబాద్‌కు చెందిన అకాడమీ వారిని 9052999365 ఫోన్ నెంబర్లో సంప్రదించవచ్చు. వారే శిక్షణకూడా ఇస్తారు.



పిచికారీకి డ్రోన్ సిద్ధం చేస్తున్న ఆపరేటర్

రైతుల నుండి డిమాండ్ పెరుగుతోంది

బీటెక్ పట్టభద్రుడైన నేను ఓ బ్యాంక్‌లో సేల్స్ మేనేజర్‌గా పని చేస్తూనే డ్రోన్‌ను అద్దెకు నడుపుతున్నా. హైదరాబాద్‌లోని ఎన్‌ఐపీహెచ్‌ఎం-మారుత్ అకాడెమీలో డ్రోన్ ఆపరేటింగ్‌పై శిక్షణ తీసుకున్నా. మారుత్ ఏజీ 365 డ్రోన్ ద్వారా మా ఆరెకరాల్లోని పంటలకు పిచికారీ చేయడంతో పొరుగు రైతులకు కూడా అద్దె విధానంలో డ్రోన్ సేవలను అందిస్తున్నా. ఇలా రెండు నెలలుగా సుమారు 100ఎకరాలకుపైగా పొలాలకు పిచికారీ చేసి.. రెండు నెలల్లో రూ.లక్ష సంపాదించా. రైతుల స్పందన వస్తోంది. రోజుకు 10 నుంచి 15 ఎకరాలు పిచికారీ కోసం ఆర్డర్లు రావడం మొదలయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి మద్దతు ఉంటే వరంగల్‌లోని రైతులకు డ్రోన్ సేవలను మరింత విస్తృతంగా అందించగలుగుతా.

\- అన్వేష్, డ్రోన్ యజమాని, యువరైతు, ఊరుగొండ, ఆత్మకూరు



కాకతీయుల వారసుడు పెళ్లికొడుకాయెనే..

- ఖజురహోలో అంగరంగవైభవంగా కమల్‌చంద్ర వివాహం
- 2022లో మొదటి సారి ఓరుగల్లుకు వచ్చిన బంజ్ దేవ్
- 700 ఏళ్ల తర్వాత కాకతీయ గడ్డపై కాలిడిన వారసుడీయన..



అంబారిపై కమల్ చంద్ర బంజ్ దేవ్

హనుమకొండ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : కాకతీయుల రాజవంశంలో 22వ వారసుడైన కమల్ చంద్ర భంజ్ దేవ్ వివాహం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. బస్తర్ మహరాజు అయిన బంజ్ దేవ్.. నాగోడ్ యువరాణి భువనేశ్వరిని వివాహమాడారు. ఖజురహోలో జరిగిన ఈ వేడుకకు దేశంలోని వివిధ రాజ్యాల ప్రముఖులు హాజరయ్యారు. వివాహ వేడుకల్లో భాగంగా మాతా దంతేశ్వరి అమ్మవారికి ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర మహిళా పోలీసు దళం తుపాకీ పేల్చి గౌరవ వందనం సమర్పించింది. వివాహం కోసం ప్రత్యేకంగా మూడు విమానాలు, రెండు హెలీకాప్టర్లు ఏర్పాటు చేశారు. ఏనుగు అంబారీ, ఒంటెల ప్రదర్శన గిరిజనుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వారం రోజులుగా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పేరొందిన కళాకారులు తమ ప్రదర్శనలు ఇచ్చారు. శనివారం వరంగల్‌కు చెందిన గజ్జెల రంజిత్ బృందం ఆధ్వర్యంలో పేరిణి నృత్యప్రదర్శన జరగనుండగా.. వరంగల్‌కు చెందిన చరిత్రకారుడు, టార్చ్ సంస్థ కార్యదర్శి అరవింద్ ఆర్యా ఈ వివాహవేడుకల్లో పాల్గొంటున్నారు.

2022లో వరంగల్ వచ్చిన వారసుడు

కాకతీయుల వారసుడు కమల్ చంద్ర బంజ్ దేవ్ 2022 జూలై 7న మొదటి సారి ఓరుగల్లుకు విచ్చేశారు. కాకతీయ వైభవ సప్తాహం ఉత్సవాల్లో పాల్గొనేందుకు ముఖ్యఅతిథిగా బంజ్ దేవ్ రాగా.. 700 ఏళ్ల తర్వాత కాకతీయుల రాజవంశం నుంచి 22వ తరం వారసుడిగా తమ పూర్వీకులు ఏలిన ఓరుగల్లు గడ్డపై ఆయన అడుగుపెట్టారు. ఈ సందర్భంగా ఆయనకు ఓరుగల్లు వాసులు ఘనంగా స్వాగతం పలికారు. వరంగల్ పర్యటనలో భాగంగా ఆయన భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. బస్తర్‌లోని తమ ఇలవేల్పు దంతేశ్వరికాగా వరంగల్‌లో కాకతీయుల కొంగుబంగారం భద్రకాళి అమ్మవారని, ఇద్దరూ ఒక్కటేనని నాడు కమల్ చంద్ర బంజ్ దేవ్ వ్యాఖ్యానించడం గమనార్హం.



పెళ్లి కుమారుడుగా కాకతీయుల వారసుడు కమల్ చంద్ర బంజ్ దేవ్

ఓరుగల్లుపై రక్తపు మరకలు

- కత్తులు, రాడ్లతో దుండగుల స్వైరవిహారం
- కుటుంబ తగాదాలు, ఆస్తి, వివాహేతర, భూ సమస్యలతో ఘటనలు
- నిలువరించడంలో పోలీసుశాఖ ఉదాసీనత

ఇటీవల పెరుగుతున్న ప్రతీకార దాడులు





వెంకన్న

జనగామలో వెంకన్న హత్య కేసులో నిందితుల అరెస్టు (ఫైల్)

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మానవత్వం మరచిన వ్యక్తులు కత్తులతో దాడులకు తెగబడుతున్నారు. కర్కశంగా వ్యవహరిస్తూ హత్యాయత్నాలకు పాల్పడుతున్నారు. ఇటీవల జరుగుతున్న ఇలాంటి ఘటనలు ఉమ్మడి వరంగల్ జిల్లాలో కలకలం రేపుతున్నాయి. ఎలాంటి వణుకు, బెణుకు లేకుండా పగలు, ప్రతీకారాల మాటున నడిరోడ్డుపై కిరాతకంగా కత్తులతో పొడిచి, ఇనుప రాడ్లు, బండ రాళ్లతో తలలపై కొట్టి వ్యక్తులను అంతమొందించి రాక్షస చర్యలకు పాల్పడుతున్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో గురువారం ఒక్క రోజే మూడుచోట్ల హత్యాయత్నాలు జరగడం ప్రజలను కలవరపెడుతోంది. విచ్చలవిడిగా అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలు, గంజాయి విక్రయాలు జరుగుతుండటంతో పూటుగా తాగి మద్యం మైకంలో పగలు, ప్రతీకారాల పేరిట చెలరేగిపోతున్నారు. పోలీసుశాఖ నిర్లక్ష్యం వీడి, ఇలాంటి వారి పట్ల కఠినంగా వ్యహరించకపోతే రోజుకో హత్య, హత్యాయత్నం, లైంగికదాడులను చూడాల్సి వస్తుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

వరుస ఘటనలతో బెంబేలు

హత్యలు, హత్యాయత్నాలతో ఉమ్మడి వరంగల్ అట్టుడికిపోతోంది. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని వెస్ట్‌జోన్(జనగామ)లో జనవరి 11న రైల్వేస్టేషన్‌లో కోతులు ఆడిస్తూ జీవనం వెళ్లదీసే మహబూబాబాద్ జిల్లాకు చెందిన బానోతు వెంకన్నను ప్రతీకారం పేరిట గాండ్ల సంపత్ అనే వ్యక్తి మరో ఇద్దరితో కలిసి కత్తులతో పొడిచి, బండ రాయితో మోదీ శవాన్ని పెట్రోల్ పోసి తగలబెట్టడం కలకలం రేపింది. అలాగే ఓ మహిళ విషయంలో ఇద్దరు ఆటోడ్రైవర్ల మధ్య ఏర్పడ్డ వివాదం కారణంగా జనవరి 22న సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అదాలత్ జంక్షన్‌లో సమీపంలో పట్టపగలే ఆటోడ్రైవర్ మాచర్ల రాజ్‌కుమార్‌ను అందరూ చూస్తుండగానే మరో ఆటో డ్రైవర్ వెంకటేశ్వర్లు విచక్షణారహితంగా కత్తితో శరీర భాగాలను ఛిద్రం చేసి హత్య చేయడం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ఈనెల 19న భూపాలపల్లి జిల్లాలో సామాజిక కార్యకర్త నాగవెల్లి రాజలింగమూర్తిని గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో దాడిచేసి హత్య చేశారు. తాజాగా వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని సెంట్రల్ జోన్ పరిధిలో గురువారం ఒక్కరోజే మూడు సంఘటనలు చోటు చేసుకోవడంతో ప్రజలు తీవ్ర భయాందోళనలో ఉన్నారు. మట్టెవాడ పీఎస్ పరిధిలోని వాసవి కాలనీలో కోట చంద్రశేఖర్ అనే వ్యక్తి భార్యతో పాటు అత్త, మామను కత్తితో డాడిచేసి హత్యాయత్నం చేయగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అలాగే కారులో కాజీపేట నుంచి భట్టుపల్లి మీదుగా ఉర్సు గుట్టకు వెళుతున్న యువ వైద్యుడు గాదె సుమంత్‌రెడ్డిని అమ్మవారిపేట క్రాస్ వద్ద గుర్తుతెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. తీవ్ర గాయాలైన వైద్యుడు ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చేరాడు. ఇదిలా వుండగా, హసన్‌పర్తి మండలంలోని మడిపల్లిలో రెండు కుటుంబాల మధ్య ఏర్పడిన అంతర్గత కలహాలు కారణంగా నలుగురు వ్యక్తులపై కత్తులు, రోకలిబండతో దాడిచేయగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. మరో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

జోరుగా మద్యం, గంజాయి విక్రయాలు

హత్యలు, హత్యాయత్నాలు మద్యం, గంజాయి మత్తులో జరిగినట్లుగానే పోలీసుల విచారణలో తేలింది. బస్టాండ్, రైల్వేస్టేషన్‌ల పరిధిలో ఉన్న పోలీస్‌స్టేషన్‌లల్లో తెల్లవారుజాము వరకు మద్యం, గంజాయి అమ్మకాలు జోరుగా సాగుతున్నట్లు ఆరోపణలున్నాయి. సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులను మచ్చిక చేసుకుని విచ్చలవిడిగా విక్రయిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. ప్రధానంగా హనుమకొండ బస్టాండ్, వరంగల్ బస్టాండ్, కాజీపేట రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో మద్యం, గంజాయి విచ్చలవిడిగా విక్రయాలు చేస్తున్నారని తెలుస్తోంది. ఎవరైనా ప్రశ్నిస్తే వారిపైకి దాడులు చేసేందుకు ప్రత్యేక బృందాలు కూడా మద్యం, గంజాయి దందా చేసే వ్యక్తులు నియమించుకున్నారని తెలుస్తోంది.

కొరవడిన ముందస్తు సమాచారం

పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏమి జరుగుతుందనే దానిపై ముందస్తు సమాచారాన్ని సేకరించడంలో పోలీసులు వైఫల్యం చెందినట్లుగా తెలుస్తోంది. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా నేరం జరిగిన తర్వాత పోలీసులు ఆగమేఘాలమీద స్పందిస్తున్నారు తప్పా.. దానికి కంటే ముందు నేరం జరగకుండా అరికట్టాల్సిన అంశాలపై దృష్టిసారించడం లేదనే అపవాదు పోలీసులపై ఉంది. ఆయా ఠాణాల పరిధిలో ఏమేమి దందాలు జరుగుతున్నాయి..? ప్రజలకు ఎవరితో ప్రమాదం ఉంది..? అధికారులు నేరస్థులతో ఏ విధంగా వ్యవహరిస్తున్నారు..? అనే దానిపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచి ఉన్నతాధికారులు దృష్టికి తీసుకపోవాల్సిన ఫీల్డ్ ఆఫీసర్లు సైతం సమాచారం కోసం పక్కవారిపై ఆధారపడి వారి ఇచ్చిన సమాచారాన్నే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి సమస్య తీవ్రతను తగ్గిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తోన్నాయి.

సరిహద్దుల పేరిట విధుల్లో నిర్లక్ష్యం

కమిషనరేట్ పరిధిలోని ఠాణాల మధ్య గెట్ల పంచాయితీలు బాధితులకు శాపంగా మారాయి. హత్యలు, రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు మా ఠాణా పరిధి కాదంటే.. మా ఠాణా పరిధి కాదని.. అసలు విషయాన్ని పక్కకు పెట్టి పంచాయితీని ముందేసుకొని సమస్యలను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు పోలీసు అధికారులపై వస్తున్నాయి. ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏదో ఒక చోట సరిహద్దు తగాదా ఉంటోందని బాధితులతో పాటు పోలీసుశాఖలోని కొంత మంది సీనియర్ అధికారులు అంటున్నారు. తాజాగా భట్టుపల్లిలో జరిగిన హత్యాయత్నంలో సైతం ఇద్దరి సీఐల మధ్య ఇదే వాదన జరిగినట్లుగా సమాచారం. కేసు నమోదు చేయడం, దర్యాప్తు, కోర్టులో సాక్ష్యాలను ప్రవేశపెట్టడంలాంటి లొల్లి మాకెందుకని, మా పరిధిలోకి రాదంటూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని తెలుస్తోంది. ఎవరి పరిధిలోకి వచ్చినా ప్రమాదం తెలిసినప్పుడు, సంఘటన స్థలాన్ని అధికారి సందర్శించినప్పుడు తప్పించుకోకుండా జీరో ఎఫ్‌ఐఆర్ చేసి తర్వాత కేసును సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసే వీలుందని కొంత మంది అధికారులు పేర్కొంటున్నారు. గురువారం భట్టుపల్లిలో జరిగిన సంఘటనలో సమీపంలో ఉన్న బెల్టుషాపు నిర్వాహకుడు ఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం తీసుకొస్తున్నాడో తెలుసుకొని అదే పోలీస్‌స్టేషన్ పరిధిలోకి హత్యాయత్నం జరిగిన ఏరియా వస్తోందని నిర్ధారించుకొని కేసు నమోదు చేశారని విశ్వసనీయ సమాచారం. పనిచేసే పోలీస్‌స్టేషన్ పరిధిలో హద్దులు కూడా తెలియకుండా పోలీసులు విధులు నిర్వహించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తోన్నారు.

ప్రారంభోత్సవ కార్యక్రమానికి..

భారతీయ నాటక కళ సమితి ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి 51వ ఆహ్వాన నాటిక పోటీల ప్రారంభోత్స కార్యక్రమానికి సభాధ్యక్షుడిగా స్థానిక వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ముఖ్య అతిథిగా వరంగల్ ఎంపీ కడియం కావ్య, విశిష్ట అతిథులుగా తెలంగాణ స్టేట్ కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ అధ్యక్షుడు మార్నేని రవీందర్‌రావు, వరంగల్ మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, ఆత్మీయ అతిథులుగా కేంద్ర ఖాదీ చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం, న్యాయవాద పరిషత్ జిల్లా అధ్యక్షుడు చోల్లేటి రామకృష్ణ హాజరు కానున్నారు.



భారతీయ నాటక కళా సమితి ఆహ్వాన పత్రికతో నిర్వాహకులు

ఇంతింతై.. కళలకు సొంతమై..

- వర్ధన్నపేటలో ఉభయ రాష్ట్రస్థాయి నాటికల పోటీలు
- నేటి నుంచి ఐదురోజుల పాటు నిర్వహణ
- తరలిరానున్న రాష్ట్రస్థాయి కళాకారులు

ఇంతింతై.. కళలకు సొంతంగా మారుతోంది వర్ధన్నపేట. 51 ఏండ్ల కిందట 8మందితో నాటికలకు బీజం పడగా.. నేడు అది మహావృక్షంలా ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా విలసిల్లుతోంది. వర్ధన్నపేట పట్టణంలో శివరాత్రి సందర్భంగా ఐదు రోజుల పాటు భారతీయ నాటికలు ప్రదర్శించనున్నారు. వివిధ రాష్ట్రాల కళాకారులతో ఏటా భారతీయ నాటక కళా సమితి రాష్ట్రస్థాయి నాటిక పోటీలు నిర్వహిస్తోంది. కళలకు వేదికగా వర్ధన్నపేట భారతీయ నాటక కళా సమితి నిలవగా, అర్ధ శతాబ్దం దాటడంతో కళా సమితి సభ్యులకు ఆనందాన్ని తెస్తోంది.

వర్ధన్నపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి పండుగను పురస్కరించుకుని ఐదు రోజుల పాటు వర్ధన్నపేట పట్టణంలోనాటకోత్సవాలు ప్రజలకు ఎంతో అలరించనున్నాయి. ఈ నెల 22 నుంచి 26వ తేదీ వరకు నాటక పోటీల షెడ్యూల్‌ను ప్రకటించగా, ఐదు రోజులు పూర్తి నాటికలు వేసి, శివరాత్రిన ఇతర కార్యక్రమాలు, బహుమతుల ప్రదానం చేస్తారు. 22న మొదటి ప్రదర్శన విశ్వశాంతి కల్చరల్ అసోసియేన్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో స్వేచ్ఛ, రెండో ప్రదర్శన డీఎల్ కాంతారావు పోస్టల్ ఉద్యోగులు, తెనాలి వారి ఆధ్వర్యంలో ది లెస్సన్, 23న కళాంజలి హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో వీడేం మగవాడండీ బాబు, రెండో ప్రదర్శనగా ది అమెచ్యూర్ డ్రమటిక్ అసోసియేషన్ చిలుకలూరిపేట వారి ఆధ్వర్యంలో వర్క్ ఫ్రమ్ హోమ్, 24న ఉషోదయ కళానికేతన్, కట్రపాడు వారి ఆధ్వర్యంలో కిడ్నాప్, రెండో ప్రదర్శనగా మైత్రి కళానిలయం విజయవాడ వారి ఆధ్వర్యంలో బ్రహ్మ స్వరూపం, 25న శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరు వారి ఆధ్వర్యంలో జనరల్ బోగీలు, రెండవ ప్రదర్శనగా కళానికేతన్, వీరన్నపాలెం వారి ఆధ్వర్యంలో ఋతువులేని కాలం, 26న శివరాత్రి పండుగ సందర్భంగా పలు కల్చరల్ ప్రోగ్రామ్స్, విజేతలకు బహుమతుల ప్రదానం చేస్తారు.



భారతీయ నాటక కళ సమితి ఆడిటోరియం

నాలుగు దశాబ్దాలుగా..

1974లో వర్ధన్నపేట మండలం ఇల్లందలో ఈగ శ్రీహరి, వడ్లకొండ వెంకటయ్య, వేముల ఆంజనేయులు, మల్లూరి రంగయ్య, పోశాల సూర్యనారాయణ, సిరివేలు వెంకట్రామరావు, వనం లక్ష్మీకాంతరావు, వడ్లకొండ ఎల్లగౌడ్ తదితరులు భారతీయ నాటక కళాసమితికి బీజం వేశారు. 1980లో వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద నుంచి ఆనాటి తాలుకా కేంద్రమైన వర్ధన్నపేటకు వేదిక మారింది. అప్పట్లో నిర్దిష్టమైన స్థలం, ప్రత్యేక వేదికంటూ లేకపోవడంతో నాటిక పోటీలకు తీవ్ర అవరోధాలు ఏర్పడేవి. దీంతో వడ్లకొండ ఎల్లగౌడ్ దర్శకత్వంలో స్థానిక కళాకారులతో అల్లూరి సీతారామరాజు నాటికను ప్రదర్శించి దాతల ద్వారా విరాళాలు సేకరించారు. అలా అల్లూరి సీతారామరాజు నాటక ప్రదర్శన ద్వారా సేకరించిన డబ్బుతో స్థల సేకరణ చేసి భారతీయ నాటక కళ సమితి శాశ్వత భవనం, నాటికల ప్రదర్శన కోసం ప్రత్యేకంగా వేదికను ఏర్పాటు చేశారు.

కలగానే జాతీయ స్థాయి పోటీలు

గతంలో నాటిక కళా సమితి కమిటీ సభ్యులు ఎంతో కృషి చేసి నాటకాలను రాష్ట్రస్థాయికి చేరేలా కృషిచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కళాకారులతో పాటు తమిళనాడుకు చెందిన కళాకారులను తీసుకువచ్చి నాటికలు ప్రదర్శింపచేశారు. సినీ రంగంలో మంచి స్థానాల్లో ఉన్న క్యారెక్టర్ ఆర్టిస్టులను సైతం తీసుకువచ్చారు. కానీ, ప్రస్తుతం హైదరాబాద్ నుంచి మాత్రమే ఎక్కువ శాతం నాటికలు ప్రదర్శించే వారు వస్తున్నారు. దీంతో భారతీయ నాటిక పోటీలు ఇంకా రాష్ట్రస్థాయిలో ఉండిపోయాయి. ఇక జాతీయ స్థాయిలో పోటీలు కళగానే మిగిలిపోయే అవకాశాలు ఉన్నాయా? అంటూ ప్రేక్షకులు చర్చించుకుంటున్నారు. గతంలో విమర్శలు రావడంతో ఇప్పటి ఆహ్వాన పత్రికలో ఉభయ తెలుగు రాష్ట్రాలస్థాయి పోటీలని ముద్రించి చేతులు దులుపుకున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సైతం కళా సమితి ముందుకు వెళ్తే ఆదరణ బాగుంటుందని సూచిస్తున్నారు.

క్రైం కార్నర్

డోర్నకల్ సుభాష్ వీధిలో చోరీ

● రూ.30 వేల నగదు అపహరణ

డోర్నకల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కేంద్రంలోని సుభాష్‌వీధిలో నివాసముంటున్న విశ్రాంత రైల్వే ఉద్యోగి లకావత్ హరిరామ్ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు ఎస్సై ఉమ తెలిపారు. శుక్రవారం ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. సుభాష్ వీధిలో నివాసముండే హరిరామ్ కుటుంబసభ్యులతో కలిసి 4రోజుల క్రితం హైదరాబాద్‌కు వెళ్లాడు. శుక్రవారం ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో గమనించిన పొరుగు వారు హరిరామ్ బంధువు రత్నంకు సమాచారం అందించారు. వెంటనే రత్నం హరిరాం ఇంటికి చేరుకుని పరిశీలించి చోరీ జరిగినట్లు భావించి హరిరాంకు సమాచారం అందించాడు. హరిరామ్ తన పూజగదిలో రూ.30 వేలు దాచానని తెలపడంతో రత్నం వెళ్లిచూసి అవిలేకపోవడంతో చోరీకి గురైనట్లు గుర్తించడంతో పోలీసులకు విషయం తెలిపాడు. ఎస్సై ఉమ సిబ్బందితో వచ్చి దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. క్లూటీం బృందాన్ని రప్పించి ఆధారాలు సేకరించారు. రత్నం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ట్రాక్టర్ పల్టీ : డ్రైవర్‌కు గాయాలు



పల్టీకొట్టిన మొక్కజొన్న లోడు ట్రాక్టర్

బయ్యారం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : అదుపు తప్పి ట్రాక్టర్ పల్టీకొట్టగా, డ్రైవర్‌కు గాయాలైన ఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. అల్లిగూడెం గ్రామం నుంచి మొక్కజొన్నల లోడ్‌తో ట్రాక్టర్ మహబూబాబాద్ మార్కెట్‌కు వెళ్తుంది. ఈ క్రమంలోనే మార్గమధ్యలోని బయ్యారం శివారు పెట్రోల్ బంక్ సమీపంలోకి రాగానే ట్రాక్టర్ అదుపుతప్పి, పల్టీ కొట్టడంతో డ్రైవర్ నవీన్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రుణ్ని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కాగా, టైర్ పంచర్ కావడంతో ట్రాక్టర్ పల్టీ కొట్టినట్లు తెలుస్తుంది.

మాజీ సర్పంచ్‌పై హత్యాయత్నం

గార్ల, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి) : శేరిపురం మాజీ సర్పంచ్ బీఆర్ఎస్ మండల నాయకుడు దరవత్ సక్రునాయక్‌పై శుక్రవారం కొండలమ్మ గుడి ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడ్డారు. మండల కేంద్రంలో పనులు ముగించుకొని శేరిపురం బయలు దేరిన సక్రును గమనిస్తూ దుండగులు ఒక్కసారిగి కర్రతో దాడి చేశారు. చుట్టుపక్కల మిర్చి తోటలు ఏరుతున్న కూలీలు గమనించి అరుపులు, కేకలు వేయడంతో దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. గతకొంత కాలంగా భార్యాభర్తల మధ్య ఘర్షలు జరుగుతుండగా, భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ దాడి భార్య తరుపు వారుచేసి ఉంటారని గ్రామస్థులు భావిస్తున్నారు. సక్రునాయక్ తల్లిదరావత్ మణెమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై రియాజ్‌పాష కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక డంప్ స్వాధీనం

డోర్నకల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కేంద్రం శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ కృష్ణవేణి, ఆర్ఐ యాసిన్ శుక్రవారం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం. షైనార్టీ పాఠశాల వెనుక ఖాళీగా ఉన్న స్థలంలో ఇసుక డంప్ ఉన్నట్లు వచ్చిన సమాచారంతో అక్కడికి వెళ్లి దానిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సుమారు ఏడు ట్రాక్టర్ల వరకు ఇసుక ఉందని చెప్పారు.

ట్రాక్టర్ పట్టివేత

సీరోలు, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిలుక్కోయిలపాడు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై నగేష్ శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. చిలుక్కోయిలపాడు నుంచి ఇతర గ్రామాలకు అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్‌చేసి, సంబంధిత డ్రైవర్ బానోత్ శ్రీకాంత్, యాజమాని మాన్యాలపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

రాములుతండాలో..

గూడూరు, (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు సీఐ గిరిధర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. రాములుతండాలో భూక్య మంగ్యాకు చెందిన ట్రాక్టర్ అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పట్టుకుని సీజ్ చేసినట్లు చెప్పారు. సంబంధిత డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు గిరిధర్‌రెడ్డి వివరించారు.

వట్టివాగు సమీపంలో..

కేసముద్రం, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి) : ఉప్పరపల్లి సమీపంలోని వట్టివాగు వద్ద నిల్వ చేసిన ఇసుకను శుక్రవారం సీజ్ చేసినట్లు తహసీల్దార్ దామోదర్, ఎస్ఐ మురళీధర్ రాజ్ తెలిపారు. కేసముద్రానికి చెందిన హతిరాం వాగు వెంట సుమారు 50 ట్రిప్పుల ఇసుకను అక్రమంగా నిల్వచేసినట్లు వారు చెప్పారు. ఇసుకను సీజ్‌తో పాటు కేసు నమోదు చేయనున్నట్లు వారు తెలిపారు.

లారీ ఢీకొనడంతో

చిన్నారికి గాయాలు

కేసముద్రం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం పొట్టిశ్రీరాములు సెంటర్‌లో శుక్రవారం ఉదయం ఆటోను వెనుకనుంచి లారీ ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఆరేళ్ల నీరుడు భవ్యశ్రీ గాయపడింది. మహబూబాబాద్‌కు చెందిన నీరుడు చందన, ఆమె కూతురు భవ్యశ్రీ బంధువులతో కలిసి వరంగల్ జిల్లా నెక్కొండ మండలం పెద్దకొర్పోలుకు ఆటోలో వెళుతున్నారు. లారీ ఆటోను ఢీకొట్టడంతో ఆటోలో ఉన్న భవ్యశ్రీ తలకు తీవ్ర గాయం కాగా, స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించి మహబూబాబాద్‌కు తరలించారు.

6 క్వింటాళ్ల నల్లబెల్లం స్వాధీనం

నెల్లికుదురు, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న 6 క్వింటాళ్ల నల్లబెల్లంను శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు. మండలంలోని జామతండాకు చెందిన గుగులోత్ నగేష్, రాయపర్తి మండలం గుపెడుతండాకు చెందిన డ్రైవర్ గుగులోత్ జాను, మల్లంపెల్లి మండలం చంద్రుతండాకు చెందిన గుగులోత్ పవన్, గుగులోత్ రవిలు కలిసి కర్నాటక రాష్ట్రం బీదర్ నుంచి బెల్లాన్ని తీసుకవచ్చి వాహనంలో తొర్రూరు నుంచి మహబూబాబాద్‌కు తరలిస్తున్న క్రమంలో మండలంలోని రావిరాల స్టేజీవద్ద పట్టుకున్నట్లు తెలిపారు. బెల్లంతో పాటు వాహనాన్ని సీజ్‌చేసి నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్ బాబు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు

● రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి

మహబూబాబాద్, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ నుంచి రాష్ట్రంలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ ఏర్పాట్లపై సంబంధిత జిల్లా ఎన్నికల అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణ, ఓటు సమాచార స్లిప్పుల పంపిణీ, సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ఏర్పాటు, బ్యాలెట్ బాక్సుల తరలింపు, పోలింగ్ కేంద్రాల్లో వసతులు, పోలీస్ బందోబస్తు, ఎన్నికల ప్రవర్తన నియామావళి అమలు తదితర అంశాలపై రిటర్నింగ్ అధికారులు, సంబంధిత జిల్లాల కలెక్టర్లకు సూచనలు చేశారు. వీసీ అనంతరం జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ ఈసీ మార్గదర్శకాల ప్రకారం ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలను సందర్శించి వసతులు సరి చూసుకోవాలన్నారు. విధులు నిర్వహించే సిబ్బందికి సదుపాయలు కల్పించాలన్నారు. ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత భద్రతా నడుమ బ్యాలెట్ బ్యాక్సులను తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్, అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మచారి, ఆర్డీవోలు గణేష్, కృష్ణవేణి పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్

పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి

● కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఇంటర్ విద్య, పాఠశాల విద్య, రెవెన్యూ, పోలీసు, రవాణా, వైద్యఆరోగ్యం, విద్యుత్, పోస్టల్ శాఖల అధికారులతో ఇంటర్ పరీక్షల నిర్వహణపై జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 5వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో 20 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, మొదటి సంవత్సరం విద్యార్థులు 4392, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 4,910 మొత్తంగా 9,302 మంది పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. డీఎస్పీ తిరుపతిరావు, ఆర్డీవోలు గణేష్, కృష్ణవేణి, ఇంటర్‌మీడియట్ అధికారి మదార్, డాక్టర్ మురళీధర్, జి.శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, ఎన్.రవీందర్, ప్రభాకర్, వినోద్ పాల్గొన్నారు.

మాతృభాష ఔన్నత్యాన్ని కాపాడుకోవాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మాతృభాష ఔన్నత్యాన్ని కాపాడుకోవాలని ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. మహబూబాబాద్‌లోని నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా అనేక భాషలు అంతరించిపోతున్నాయని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎన్ని భాషలు నేర్చుకున్నా మాతృభాషను మరిచిపోకూడదన్నారు. ప్రతీ విద్యార్థి మాతృభాషలో ఒక్కసారైనా మాట్లాడాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు అనిల్‌కుమార్, సాంబశివరావు, శ్రీనివాస్, రాజశేఖర్, హతిరామ్, ఖాసీంషా, సుమన్, యుగందర్, ప్రభావతిదేవి, నాగరాజు, ఉదయ్ కుమార్, నరష్, సంతోష్ పాల్గొన్నారు.

● జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలుగు ఉపాధ్యాయుడు మద్దెల రమేష్‌ను కళాశాల కరస్పాండెంట్ డోలి సత్యనారాయణ ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, కృష్ణారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నలంద డిగ్రీ కళాశాలలో రమేష్‌ను సన్మానిస్తున్న కరస్పాండెంట్ డోలి సత్యనారాయణ

● జిల్లా కేంద్రంలోని గాదెరు క్మారెడ్డి మెమోరియల్‌హైస్కూల్‌లో మాతృ దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయునీలు సరోజినీదేవి, సరస్వతి, శిరీష, మమతను సన్మానించారు. డైరెక్టర్లు రీనాగోపికృష్ణ, రజితామాధవ్, రజితాకృష్ణమూర్తి, బీసీ నాయకులు శంతన్‌రామరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించాలి

● విజ్ఞాన భారతి విద్యాసంస్థల చైర్మన్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి) : మార్చిలో ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించాలని విజ్ఞాన భారతి విద్యాసంస్థల చైర్మన్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. మహబూబాబాద్‌లోని గౌతమి జూనియర్ కళాశాలలో శుక్రవారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి, మాట్లాడారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసి, మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులు చేసిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కళాశాల కరస్పాండెంట్ తక్కెళ్లపల్లి సంధ్యారాణి, ప్రిన్సిపాల్ డాక్టర్. అరుణ్‌కుమార్, అధ్యాపకులు శ్రీరామ్, అనిత, సరిత, రఘు, రవికుమార్, సంపత్ పాల్గొన్నారు.



విద్యార్థినికి కప్ అందిస్తున్న తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, సంధ్యారాణి దంపతులు



వాహనం కొనుగోలు చేసిన వినియోగదారుడు అరవింద్ కుమార్‌కు తాళపు చెవిని అందిస్తున్న జోనల్ మేనేజర్ ప్రమోద్ పాండే

మిత్ర సుజుకీ టూ వీలర్ షోరూం ప్రారంభం

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని యశోద గార్డెన్స్ సమీపంలోని నర్సంపేట బైపాస్ రోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసినమిత్ర సుజుకీ టూ వీలర్ షోరూంను శుక్రవారం జోనల్ మేనేజర్ ప్రమోద్‌పాండె, రీజినల్ మేనేజర్ వెంకటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన టెక్నాలజీతో సుజుకిమోటార్స్ ఆధ్వర్యంలో ద్విచక్రవాహన రంగంలో కొత్త మోడల్స్‌ను ప్రజల సౌకర్యార్థం సరసమైన ధరలకు అందుబాటులో తీసుకువచ్చినట్లు చెప్పారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్స్ నడికొట్టు శ్రీనివాస్‌రెడ్డి, నడికొట్టు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ మిత్ర సుజుకి షోరూంలో ద్విచక్రవాహనాలకు సంబంధించి సర్వీస్, స్పేర్‌పార్ట్స్ అందుబాటులో ఉంటాయని తెలిపారు. సుజుకి షోరూం ఉద్యోగులు, వినియోగదారులు పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి గల్లంతు

తొర్రూరు రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాటేడు గ్రామ చెరువులో స్నానాలకు వెళ్లి దూదిమెట్ల ఐలయ్య అనే వ్యక్తి గల్లంతైన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం. మాటేడు గ్రామానికి చెందిన బాతుక వెంకన్న (60) అనారోగ్యంతో ఉదయం మరణించగా, అతని దహనసంస్కారాలు నిర్వహించి చెరువుల్లో స్నానాలకు వెళ్లారు. ఈ క్రమంలో గ్రామస్థులు, బంధువులు స్నానాలు చేస్తుండగా ఐలయ్య, మరికొంత మంది ఈత కొడుతున్న సమయంలో ఐలయ్య గల్లంతు అయ్యాడు. చెరువు బయటకు వచ్చిన బంధువులు చూడడంతో ఐలయ్య కనిపించకపోవడంతో చెరువులో కుటుంబసభ్యులు, గ్రామస్థులు గాలింపు చేపట్టారు.

హాస్టళ్లను తనిఖీ చేసిన అధికారులు

నెల్లికుదురు, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్, కేజీబీవీ, మోడల్ స్కూల్ వసతి గృహలను మండల ప్రత్యేకాధికారి జీనుగు మరియన్న శుక్రవారం తనిఖీ చేశారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. హాస్టళ్లలో ఖాళీ స్థలాలలో కూరగాయలు పండ్లమొక్కలు పెంచాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. బాగా చదివి తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె.రాజు, ఎంపీడీవో బాలరాజు పాల్గొన్నారు.

సారలమ్మ వనప్రవేశం

గూడూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : జగన్నాయకులగూడెంలో మూడ్రోజుల పాటు సారలమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం వనదేవత అయిన సారలమ్మను తిరిగి వన ప్రవేశం నిర్వహించారు. గ్రామ ఆదివాసీలు సారలమ్మకు వనప్రవేశం, వెలకొల్పులు, పెద్దమ్మతల్లి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మూడ్రోజులుగా నిర్వహించిన కార్యక్రమాలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై సారలమ్మను దర్శించుకున్నారు.

కిరాణా షాపులో చోరీ

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని నెహ్రూ సెంటర్‌లో ఉన్న శ్రీసాయి బాలాజీ డ్రైఫ్రూట్స్ కిరాణం షాపులో చోరీ జరిగినట్లు బాధితుడు శ్రీను శుక్రవారం తెలిపాడు. షాపు యజమాని శ్రీను తెలిపిన వివరాల ప్రకారం. కిరాణంలో చోరీ జరిగి రూ.60 వేల విలువగల సుగంధ ద్రవ్యాలు, డ్రైఫ్రూట్స్‌ను అపహరించుకుపోయినట్లు చెప్పారు. గురువారం రాత్రి షాపును మూసివేసి ఇంటికి వెళ్లిన యజమాని శుక్రవారం ఉదయం షాపు షట్టర్ తీసి చూడగా వెనుకవైపు ఉన్న తలుపులను గడ్డపారతో పగులగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లుగా గుర్తించారు. ఆపై షాపులోని సరుకులను పరిశీలించగా అవి లేకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే టౌన్ సీఐ దేవేందర్ చోరీ జరిగిన ప్రదేశానికి చేరుకుని, క్లూజ్‌టీం బృందాన్ని రప్పించి ఆధారాలు సేకరించారు. బాధితురాలు నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలి

డోర్నకల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఈ వేసవిలో ప్రజలకు తాగునీటిని నిరంతరం అంతరాయం లేకుండ సరఫరా చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. డోర్నకల్ మునిసిపల్ కార్యాలయాన్ని శుక్రవారం ఆకస్మీకంగా సందర్శించారు. కార్యాలయంలోని సిబ్బంది గదులను పరిశీలించిన అనంతరం కమిషనర్ ఉదయ్‌కుమార్‌తో కలిసి మంచినీటి ట్యాంకును పరిశీలించారు. మునిసిపల్ కార్యాలయ ఆవరణలో ఉన్న మూడు వాటర్‌ట్యాంక్‌లను పరిశీలించి వాటి నీటినిల్వ సామర్థ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. వేసవిలో ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలని కమిషనర్‌ను ఆదేశించారు. అనంతరం మునిసిపల్ మహబూబాబాద్-డోర్నకల్ ప్రధాన రహదారిపక్కనే ఉన్న డంపింగ్‌యార్డును పరిశీలించారు. ప్లాస్టిక్‌యేతర వ్యర్థాలను వేర్వేరుగా నిల్వ చేయాలని సిబ్బందిని ఆదేశించారు.



డోర్నకల్‌లో నీటి సంప్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో

పాఠశాలలను తనిఖీ చేసిన డీఈవో

బయ్యారం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మిర్యాలపెంట యూపీఎస్, కేపీ కొత్తూరు పాఠశాలను శుక్రవారం జిల్లా విద్యాధికారి (డీఈవో) రవీందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల్లో పిల్లల సామర్థ్యాలు పరిశీలించిన డీఈవో అపార్ జెనరేషన్ నూరుశాతం పూర్తి చేయాలన్నారు. ఎఫ్ఎల్ఎన్ బేస్‌లైన్, మిడ్‌లైన్‌తో పాటు ఎఫ్ఎల్ఎన్ వర్క్‌బుక్స్, పాఠశాల రికార్డులు పరిశీలించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించాలన్నారు. ఉపాధ్యాయులు అంకిత బావంతో పనిచేసి విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. సమయపాలన పాటించకుండా విధుల పట్ల నిర్లక్ష్యం వహించే ఉపాధ్యాయులపై శాఖపరంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఎంవో ఆజాద్ చంద్రశేఖర్‌తో పాటు సీఆర్పీ కర్ణయ్య పాల్గొన్నారు.

ప్రజలకు తాగునీరు అందించాలి

గూడూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) :గ్రామాల్లో ప్రజలకు క్రమంతప్పకుండా తాగునీటిని అందించాలని ఎంపీడీవో వీరస్వామి అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అధికారులు, వాటర్‌మెన్‌లతో శుక్రవారం సమీక్షసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వేసవి కాలంలో తాగునీటి సరఫరాలో ఎలాంటి నిర్లక్ష్యం వహించొద్దన్నారు. గ్రామాల్లో చేతిపంపులు పనిచేసే విధంగా మరమ్మతులు చేపట్టాలన్నారు. ఇతరత్రా పనులు చేపట్టి ప్రజలకు తాగునీటిని అందించాలన్నారు. గ్రిడ్ డిప్యూటీ ఈఈ సురేందర్, దినేష్, ఎంపీవో సత్యనారాయణ పాల్గొన్నారు.

పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరుగబోయే పదో తరగతి వార్షికపరీక్షల్లో విద్యార్థులు నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ దేశీరాంనాయక్ అన్నారు. మహబూబాబాద్ మండలం రెడ్యాల గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆకస్మీకంగా తనిఖీ చేశారు. వసతిగృహంలోని పరిసరాలు, మరుగుదొడ్లు, వంటగది, స్టోర్‌రూంను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులందరూ సమయ పాలన పాటిస్తూ విద్యార్థులకు మంచి విద్యాబోధన చేయాలన్నారు. సాయంత్రం వేళల్లో పదో తరగతి విద్యార్థులకు స్టడీ అవర్ నిర్వహించి పదిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. హెచ్ఎం సక్రునాయక్, పీడీ మోహన్‌నాయక్, వెంకన్న, లక్ష్మయ్య, సంధ్యారాణి, లక్ష్మీదేవి, సుదర్శన్, దేవ్, హన్మంతు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి

గార్ల, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి) : ఇల్లెందు నియోజక వర్గకేంద్రంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య నేతృత్వంలో 4న జరిగే సేవాలాల్ జయంతి ముగింపు సభను బంజారా సోదరులు విజయవంతం చేయాలని మాజీ ఆదాయపు పన్ను రాష్ట్ర శాఖాధికారి గంగవత్ రాంసింగ్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో జయశంకర్ విగ్రహం సమీపంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో బాబులాల్‌నాయక్, పృథ్వీరాజ్ నాయక్, మల్లిబాబు, రాంసింగ్, రాంకుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అశోక్ నాయక్, సురేష్‌నాయక్ పాల్గొన్నారు.

మిర్చి క్వింటాకు రూ.25 వేలు ఇవ్వాలి

కురవి, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి) : మిర్చి పంట ధరను క్వింటాకు రూ.25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నానిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆకుల రాజు మాట్లాడుతూ సుమారు 8 వేల ఎకరాల్లో రైతులు ఈ ప్రాంతంలో మిర్చి పంటను సాగుచేశారని, క్వింటాకు రూ.25వేలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి మలేడి కోటయ్య, నల్లపు సుధాకర్, కడియం సత్యం, రాయల మనోహర్, పోతుగంటి మల్లయ్య, మాలోతు కిషన్, కట్ల కృష్ణ, గంధసిరి శ్రీనివాస్, తగరం తిరుపతి, గొల్లపల్లి కృష్ణ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

కురవి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : రానున్న వేసవిలో గ్రామాల్లో త్రాగునీటి ఎద్దడిరాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈవో పురుషోత్తం అన్నారు. కురవిలోని రైతు వేదికలో శుక్రవారం కురవి, సీరోలు, డోర్నకల్ మండలాల కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథ సిబ్బంది జీపీ వాటర్‌మెన్ సమన్వయంతో సమస్యలు పరిష్కరించుకుని ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వీరబాబు, వివిధ గ్రామాలకార్యదర్శులు పాల్గొన్నారు.

సరోత్తంరెడ్డి విజయం ఖాయం

● మాజీ ఎంపీ సీతారాంనాయక్

కొత్తగూడ, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ, టీపాస్ బలపర్చిన పులి సరోత్తంరెడ్డి విజయం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ అన్నారు. కొత్తగూడలో శుక్రవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలోఆయన మాట్లాడుతూ సరోత్తంరెడ్డి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, రవీంద్రాచారి, మండల అధ్యక్షుడు యాదగిరి మురళి, జవహర్‌నాయక్, జినుకల కృష్ణారావు, గుగులోత్ స్వరూప, తోటకూరి మధు, బోనాల ప్రవీణ్, చారి, వజ్ర రవి, కొట్టె శ్రీను, జాడి అశోక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ సీతారాంనాయక్

ఘనంగా సేవాలాల్ జయంతి

కొత్తగూడ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో శుక్రవారం గిరిజనుల ఆరాధ్యదైవం సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు గిరిజనుల తలపాగా ధరించి ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడె నాగజ్యోతి, మాజీ ఎంపీ సీతారాంనాయక్, బీఆర్ఎస్‌నాయకులు భూక్య జంపన్న, గోవింద్‌నాయక్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బానోత్ రూప్‌సింగ్, మాజీ సర్పంచ్ మల్లెల రణదీర్, డాక్టర్ రవీందర్, బానోత్ రమేష్, జవహర్‌లాల్ నెహ్రూ, రూప్లానాయక్, రవి, సంతోష్, రాజన్న, రంజిత్ పాల్గొన్నారు.

ముస్లింలు లక్ష్యంగా చేసుకుని మాట్లాడుతున్న కేంద్రమంత్రి

● ముస్లిం జేఏసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అహ్మద్‌ఖాన్



సమావేశంలో మాట్లాడుతున్న అహ్మద్‌ఖాన్

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ విషయంలో కేంద్రమంత్రి బండి సంజయ్ ముస్లింలను టార్గెట్ చేసి మాట్లాడుతున్నారని తెలంగాణ ముస్లిం జేఏసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అహ్మద్‌ఖాన్ అన్నారు. మహబూబాబాద్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ముస్లిం జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల రాష్ట్రప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేలో పదిన్నర శాతం ముస్లిం బీసీలున్నట్లు సర్వేలో తేలిందని చెప్పారు. అప్పటి నుంచి ముస్లింలను టార్గెట్ చేస్తూ.. వారిని బీసీల నుంచి తొలగించాలని బండి సంజయ్ వ్యాఖ్యలు చేస్తున్నారని చెప్పారు. బీసీలు, ముస్లింల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సలీంపాషా, అజీజ్, ఫిరోజ్‌ఖాన్, బాబులాల్, సఫర్ పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ జలాలను విడుదల చేయాలి

మరిపెడ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఎస్సారెస్పీ జలాలను విడుదల చేసి నోటికాడికి వచ్చిన వరిపంటలను కాపాడాలని ముదిరాజ్ సంఘం జిల్లా కార్యదర్శి పిట్టల ధనంజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయనమరిపెడలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మరిపెడ మండలంలోని 44జీపీలో రైతులు రబీ సీజన్‌లో వరిపంటను వేల రూపాయాల పెట్టుబడులు పెట్టి సాగు చేశారన్నారు. వరి పొట్ట దశలో కళ్ల ముందే ఎండిపోవడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారన్నారు. ప్రభుత్వ ఎస్సారెస్పీ జలాలను విడుదల చేసి రైతులను ఆదుకోవాలన్నారు. లేనట్టైయితే తరపున ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.